క్లుప్తంగా

స్వచ్ఛమైన తాగునీటి సరఫరానే లక్ష్యం


నీటి ట్యాంకులు శుభ్రం చేయిస్తున్న అధికారులు

మద్దికెర: గ్రామస్తులకు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఎప్పటికప్పుడు ట్యాంకులను క్లోరినేషన్ చేయిస్తున్నామని సర్పంచ్ సుహాసిని, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి అన్నారు. శుక్రవారం మద్దికెరలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నీటిని సరఫరా చేసే ట్యాంకుల వద్ద శుభ్రం చేయడమే కాకుండా ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ కలిపి నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పంచాయతీ సిబ్బందితో కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని తెలిపారు.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి


అల్లుగుండులో ఏరువాక పౌర్ణమి వేడుకల్లో సీపీఐ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రైతులకు రూ. 2 లక్షలు రుణ మాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అల్లుగుండు గ్రామ శివారులో ఉన్న పొలాల్లో శుక్రవారం ఏరువాక పౌర్ణమి వేడుకల్లో సీపీఐ మండల కార్యదర్శి కృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతాంగాన్ని ఆదుకునేందుకు పథకాలు ప్రవేశ పెట్టాలన్నారు. పెట్టుబడి సాయంతోపాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా రైతు ఆత్మహత్యలను నిర్మూలించాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, చిన్న మాదులు, కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గాయత్రీదేవికి ప్రత్యేక పూజలు



ఆస్పరి: రామతీర్థంలోని గాయత్రీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గంగ, ఆకుపూజ, కుంకుమార్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. నైవేద్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్‌డీపీఐ ఆవిర్భావ దినోత్సవం


ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న నాయకులు

హొళగుంద: సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు శుక్రవారం హొళగుందలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బస్టాండ్‌లో పార్టీ జెండాను రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ హమీద్ ఆవిష్కరించారు. ఆలూరు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ రహిమాన్, నాయకులు సలాం, షఫీ, బాషా, రహంతుల్లా పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సీట్లు పెంచాలని ఆందోళన


ఆస్పరిలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఆస్పరి: గురుకుల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో సీట్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్‌లో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో సీట్లు సంఖ్య పెంచితే నిరుపేద పిల్లలు చదువుకునేందుకు అస్కారం ఉంటుందన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్, రాజు, కార్తీక్, అజిత్, నరసింహులు పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోండి

ఆలూరు: స్థానిక సహకార పరపతి సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు రెన్యూవల్ చేయించుకోవాలని సీఈఓ వెంకటరెడ్డి తెలిపారు. రైతులు పట్టాదార్ పాసుపుస్తకం, సహకార సంఘం పాస్ బుక్, ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌లతోపాటు 2 పాస్‌పోర్ట్ ఫొటోలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సభ్యత్వం చేయించుకోకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే రాయితీలు రావన్నారు.




పత్తికొండ: పోలీసులతో కలిసి యోగా చేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి,ఆలూరు: యోగా చేస్తున్న ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, మొలగవల్లి ఆది ఆంధ్ర పాఠశాల విద్యార్థులు,


తుగ్గలి: పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ హైస్కూల్‌లో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ఆయా కార్యాలయాలు, పాఠశాలల్లో యోగాసనాలు వేసిన అధికారులు, విద్యార్థులు
- యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించిన వక్తలు


మద్దికెర: యోగాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఆలూరు: హత్తిబెళగల్ జెడ్పీ పాఠశాలలో..


తుగ్గలి: పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ హైస్కూల్‌లో..


కృష్ణగిరి: కటారుకొండ జెడ్పీహెచ్ఎస్‌లో యోగా డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

పత్తికొండ రూరల్: యోగాను దినచర్యలో భాగం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఎంఎస్.భారతి అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి జడ్జి యోగాసనాలు వేశారు. అలాగే పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి స్థానిక గోపాల్ ప్లాజా ఆవరణలో పోలీసులతో కలిసి యోగా చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగ రీత్యా పోలీసులు ఒత్తిడికి గురవుతుంటారన్నారు. సాధారణ వ్యాయామంతో పాటు యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐలు ప్రవీణ్‌కుమార్, మురళీ మోహన్, దేవనకొండ సీఐ శ్రీనివాసులు, ఆస్పరి సీఐ హనుమంతప్ప, జొన్నగిరి, మద్దికెర ఎస్ఐలు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

ఆలూరు రూరల్: క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ఒత్తిడి దూరమవుతుందని వక్తలు అన్నారు. ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ధ్యానం, యోగముద్ర, దినచర్యలను విద్యార్థులకు వివరించారు. అలాగే హత్తిబెళగల్ జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో పీఈటీ చిన్న బాబు విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. మొలగవల్లి పీహెచ్‌సీ ఎంపీహెచ్ఓ ఆంద్రూస్, పురుషోత్తం మొలగవల్లిలోని ఆది ఆంధ్ర పాఠశాల విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అలాగే అరికెర అంబేడ్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధి హామీ సిబ్బందితో కలిసి యోగా డే జరుపుకున్నారు.

▶▶తుగ్గలి: పెండేకల్లు రైల్వే జంక్షన్, తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్లు పాండురంగరాజు, చందునాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగాసనాల ద్వారా మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు.

▶▶మద్దికెర: యోగాతో ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుందని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి అన్నారు. అధికారులు, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాధినిరోధక శక్తి పెంచుకోవాలంటే యోగా చేయాలని సూచించారు.

▶▶హొళగుంద: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. హొళగుంద పంచాయతీ కార్యలయంలో కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో విశ్రాంత టీచర్ సిద్ధబసప్ప సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులకు యోగా గురించి వివరించారు. ప్రతి రోజు యోగాసనాలు వేయడం వల్ల శారీరక, మానసిక రుగ్మతులు దూరమవుతాయన్నారు.

▶▶కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ, కస్తూర్బా విద్యాలయంతోపాటు పలు పాఠశాలల్లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ దేశాలకు భారతదేశం ఇచ్చిన గొప్ప వరం యోగా అని తెలిపారు. కటారుకొండ పాఠశాలలో విద్యార్థులు యోగా డే ఆకారంలో నిలబడి ఆకట్టుకున్నారు.

▶▶ఆలూరు: అరికెర అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఎంపీడీఓ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ప్రతి రోజు యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసింగా ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చిన్నహ్యాట కన్నడ యూపీ పాఠశాలలో..


ఆలూరు: అరికెర అంబేడ్కర్ గురుకులంలో..

లింగనిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఆర్డీఓ నీలపు రామలక్ష్మి

పత్తికొండ రూరల్: లింగనిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ ఆర్డీఓ నీలపు రామలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్ష నివారణ చట్టంపై ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పత్తికొండ వైద్యురాలు కల్పన, జిల్లా డిప్యూటీ ఎక్స్‌టెన్షన్ మాస్ మీడియా అధికారి శ్రీనివాసులుశెట్టి, మైత్రి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు రామ్మోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారు, అందుకు ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఆరోగ్య, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీలు, ఇతర సంఘాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. బాలికల నిష్పత్తిని పెంచాలన్నారు.


హొళగుందలో పోటీలను తిలకించేందుకు మిద్దెపైకి చేరిన జనం


సిద్ధాపురంలో పరుగులు తీస్తున్న ఎద్దులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ఘనంగా ఏరువాక పౌర్ణమి
- పల్లెల్లో హోరాహోరీగా ఎద్దుల పరుగు పోటీలు

హొళగుంద: మండలంలో శుక్రవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి పల్లెలో పండుగ వాతవరణం నెలకొంది. ఎద్దులకు రంగులు వేసి ప్రత్యేక అలంకరణ చేసి ఊరేగించారు. తొలకరి జల్లులతో వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో రైతులు చురుగ్గా వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఈ తరుణంలో ఏరువాక పండుగ రావడంతో పల్లెల్లో సందడి నెలకొంది. ఎద్దులకు ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించారు.

రసవత్తరంగా ఎద్దుల పరుగు పందేలు

వేడుకలో భాగంగా హొళగుంద, ఎల్లార్తి, హెబ్బటం, గజ్జహళ్లి తదితర గ్రామాల్లో ఎద్దుల పరుగు పందేలు నిర్వహించారు. పోటీలను తిలకించడానికి స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివచ్చారు.హొళగుందలో మరిస్వామికి చెందిన ఎద్దులు విజేతగా నిలిచాయి. విజయం సాధించిన ఎద్దులకు గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. వాటిని గ్రామ పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్ఐ పెద్దయ్యనాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఏరువాక పౌర్ణమి వేడుకలు

హాలహర్వి: మండలంలోని చింతకుంట, గూళ్యం, అర్ధగేరి, విరుపాపురం, బిలేహాల్, నిట్రవట్టి, సిద్ధాపురం, కొక్కరచేడు, బాపురం, హోసల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే వృషభాలకు స్నానాలు చేయించి రంగురంగుల పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో పరుగు పందేలు నిర్వహించారు.

ఆలూరులో సంబరాలు

- ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన బుసినె విరుపాక్షి


హాలహర్విలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆలూరు/హాలహర్వి: శాసన సభ్యుడిగా శుక్రవారం అసెంబ్లీల్లో బుసినె విరుపాక్షి ప్రమాణ స్వీకారం చేయడంతో ఆలూరు, హాలహర్విలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. పార్టీ హాలహర్వి మండలాధ్యక్షుడు పచ్చారపల్లి రామిరెడ్డి, కో–కన్వీనర్ మల్లికార్జున, నాయకులు గంగాధర, తిప్పారెడ్డి, సుంకప్ప, కృష్ణ, గోపాల్, ఈరన్న, దరగప్ప, పరశురామ్, రామయ్య, వడ్డే సురేష్, గోవిందప్ప, సికింద్ర తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే బుసినె విరుపాక్షికి ఫోన్‌ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ తీగల సమస్యకు పరిష్కారం

చిప్పగిరి: మండలంలోని దౌల్తాపురం గ్రామ పరిధిలో ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సిబ్బంది సరిచేశారు. ఈ సమస్యపై సాక్షి పత్రికలో ఇటీవల వార్త రావడంతో అధికారులు స్పందించారు. ఏఈ ఉలిగన్న, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, లైన్ మన్ చిట్టిబాబు శుక్రవారం గ్రామానికి చేరుకుని తీగలను పరిశీలించారు. మరో విద్యుత్ పోల్‌కు క్లాంపు బిగించి తీగల ఎత్తును పెంచారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


దౌల్తాపురంలో విద్యుత్ తీగల ఎత్తు పెంచుతున్న సిబ్బంది

లక్ష్యాన్ని చేరుకోవాలి


రైతు ఉత్పత్తిదారుల సంఘం గోడౌన్‌ను పరిశీలిస్తున్న వెలుగు పీడీ


వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న సలీమ్‌బాషా

హొళగుంద: వెలుగు పథకం ద్వారా జరుగుతున్న కార్యక్రమాల లక్ష్యాన్ని సకాలంలో చేరుకోవాలని వెలుగు పీడీ సలీమ్‌బాషా సిబ్బందికి సూచించారు. శుక్రవారం హొళగుందకు వచ్చిన ఆయన స్త్రీశక్తి భవనంలో ఏసీఓ నవీన్‌కుమార్, ఏపీఎం హనుమంతు, సీసీలు, ఇతన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల బలోపేతం, రుణాల మంజూరు, బ్యాంక్ రుణాలు, రికవరీలు, వ్యక్తిగత రుణాలు, ఇతర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. పొదుపు సంఘాలకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, ఇతర వాటి ద్వారా మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. అంతకు ముందు వ్యవసాయ అనుభంధ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం గోడౌన్‌ను పరీశీలించారు.

ఖరీఫ్‌లో సస్యరక్షణపై అవగాహన

దేవనకొండ: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ, పత్తి పంటలపై రసం పీల్చు పురుగులు, తెల్లదోమ, పచ్చదోమలు ఆశిస్తున్నాయని, వాటి నివారణకు మందులు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పత్తిలో ఆశించే పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చు పురుగుల నివారణకు థైమాక్షన్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 1.5ఎం.ఎల్, అసిఫెట్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకుని మొక్కలు బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వేరుశనగలో మొవ్వకుళ్లు తెగులు నివారణకు సాఫ్ 1 గ్రాము ఒక లీటర్ నీటిలో కలిపి లేదా టెబుకొనజల్ 1 ఎం.ఎల్. ఒక లీటర్ నీటిలో కలిపి బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. వేరుశనగలో పచ్చపురుగు, లద్దె పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 2.5 మి.లీ. ఒక లీటర్ నీటికి లేదా అసిఫెట్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటిలో లేదా ల్యాండసైహాల్‌త్రిన్ 1.5 మి.లీ. ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, వారి సమక్షంలో మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి


విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులందజేస్తున్న మేనేజర్లు లక్ష్మినారాయణ, సుదర్శన్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : బ్యాంకు లావాదేవీలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌పై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కలిగివుండాలని కోడుమూరు ఎస్‌బీఐ, ఏపీజీబీ మేనేజర్లు లక్ష్మినారాయణ, సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కోడుమూరులోని మోడల్ స్కూల్ విద్యార్థులకు డీఈఏ, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ, ఏపీజీబీ బ్యాంకుల మేనేజర్లు బ్యాకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్లు మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకింగ్ సేవలు ఎంతో ప్రధానమైనవని, క్రెడిట్, ఏటీఎం కార్డుల పిన్ నంబర్లను ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు చెప్పరాదన్నారు. అలాగే చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, అధ్యాపకులు, రీసోర్స్ పర్సన్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలు


స్కై మార్షల్ ఆర్ట్స్‌లో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : మార్షల్ ఆర్ట్స్‌లో భాగమే స్కై మార్షల్ ఆర్ట్స్ అని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక కోల్స్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ స్కై మార్షల్‌ఆర్ట్స్ క్రీడకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపు ఉందన్నారు. ఒలింపిక్ డేను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో విజేతలకు ఒలింపిక్ డే రోజు పతకాలు, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి నబీ సాహెబ్ పాల్గొన్నారు.

వీఆర్వోపై ఫిర్యాదు


సూపరింటెండెంట్ మేరీకి వినతిపత్రం అందజేస్తున్న రైతు రంగస్వామి

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టాదారు పాస్‌పుస్తకం కోసం వీఆర్వో లంచం తీసుకుని చేయడం లేదని వెల్దుర్తికి చెందిన బోయ రంగస్వామి శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ మేరీకి ఫిర్యాదు చేశారు. గ్రామ పొలిమేరలో సర్వే నంబర్ 442లో రెండు ఎకరాల రెండు సెంట్ల భూమి తన తండ్రి మాదన్న గతంలో పూజారి నరసింహచారి నుంచి కొనుగోలు చేశాడని తెలిపారు. అప్పటి నుంచి భూమి తమ అనుభవంలో ఉన్నా పట్టాదారు పాసుపుస్తకం లేదన్నారు. పాసుపుస్తకం కోసం ఎన్నోసార్లు వీఆర్వోను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో చివరకు రూ.30వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నామని తెలిపాడు. ఇందులో రూ.20 వేలు ఇచ్చి, మిగిలినది బుక్ వచ్చిన తర్వాత ఇచ్చేలా మాట్లాకున్నామన్నారు. అయితే కార్యాలయానికి వెళ్లి అడిగితే పట్టించుకోవడం లేదని.. ఆయనపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.